

ర్యాలీలో పాల్గొన్న వేణుగోపాలస్వామి, పార్టీ కార్యకర్తలు

రాహుల్‌గాంధీపై దాడికి వ్యతిరేకంగా ర్యాలీ

బంజారాహిల్స్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై అస్సోంలో దాడికి వ్యతిరేకంగా కాంగ్రెస్ సీనియర్ నేత, సీఏ వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.1లో మంగళవారం శాంతియుత ర్యాలీ, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీ పర్యటనలకు వస్తున్న స్పందనను చూసి ఓర్వలేని ఇలాంటి కార్యక్రమాలకు పూనుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుయుక్తులు చేసినా దేశంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు.ఈ సందర్భంగా జీవీకే వన్ అంబేడ్కర్ విగ్రహం నుంచి సోమాజిగూడ రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో పెద్దఎత్తున కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



వెంకటగిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో లంకల దీపక్‌రెడ్డి తదితరులు

బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సంబరాలు

యూసుఫ్‌గూడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన సందర్భంగా దేశవ్యాప్తంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద వెంకటగిరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బాలరాముడి చిత్రపటంతో వేదిక ఏర్పాటు చేసి భక్తి పాటలతో ఆధ్మాత్మిక వాతావరణం నెలకొల్పారు. వచ్చిన భక్తులకు మిఠాయిలు పంచుతూ సందడి చేశారు. బాణా సంచా కాల్చి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి, సినీనటి కవిత పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పులిరామ్, బరిగెల జ్ఞానేశ్వర్, బడుగు సతీష్, నీలేశ్వర్, సర్వేశ్వర్, నాగార్జున, రాజేందర్‌గుప్తా, కొండా శ్రీనివాస్, హరికిషన్, రాజు, సందీప్, బానుతేజ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగడ్డలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎర్రగడ్డ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. మంగళవారం ఎర్రగడ్డలోని సుల్తాన్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను దశలవారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు డి.సంజీవ, నాయకులు జావేద్, ఎండి మజార్, గంటా మల్లేష్, సయ్యద్ ఫజల్, షౌకత్, సయ్యద్ సలీం, మహ్మద్ సర్దార్, జి.రాము, రామచందర్, శ్రీకాంత్‌గౌడ్, బాలకృష్ణ, తరుణ్, దాసి శ్రీకాంత్, జహంగీర్, మహిళా డివిజన్ అధ్యక్షురాలు కళ్యాణి, మహిళా నాయకులు సక్కుబాయి, సైదమ్మ, లైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



ఎర్రగడ్డలో మాట్లాడుతున్న జలమండలి అధికారులు

ఎర్రగడ్డ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్లోని పలు బస్తీలలో కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని జలమండలి డీజీఎం వాహెద్ తెలిపారు. మంగళవారం ఆయన జలమండలి అధికారులు, స్థానిక నాయకులతో కలిసి డివిజన్‌లోని ప్రేమనగర్, సుల్తాన్‌నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. డివిజన్‌లోని పలు బస్తీలలో మంచినీరు అవసరమైనంతగా సరఫరా కావడం లేదని, మరికొన్ని ప్రాంతాలలో కలుషిత నీరు సరఫరా అవుతుండడం వల్ల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఎంఐఎం నాయకులు మహమ్మద్ అజర్ తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు. జలమండలి అధికారులు షకీల్, మొహమ్మద్ ఫిరోజ్, మొహమ్మద్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

విమెన్స్ కిక్ బాక్సింగ్ పోటీలో బంగారు పతకం



పతకాలు గెలుచుకున్న విద్యార్థులు

పంజాగుట్ట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వశాఖ, వాకో ఇండియా కిక్ బాక్సింగ్ ఫెడరేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయి)ల ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో ఇటీవల జరిగిన అస్మిత ఖేలో ఇండియా విమెన్స్ కిక్ బాక్సింగ్ పోటీలో 18 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 12 కేటగిరీలో మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి పాఠశాల విద్యార్థులు తన్వి, రాజేశ్వరి, హిమవర్షిత, ధన్విత బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. డైరెక్టర్లు కొల్లి లక్ష్మణ్ రావు, కృష్ణవేణి, ప్రిన్సిపల్ గీత, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

గృహిణి ఆత్మహత్య

బంజారాహిల్స్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మంకు చెందిన షేక్‌బాదంబీకు షేక్‌సైదులతో 21 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు. ఏడు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి ఫిలింనగర్ పద్మాలయ అంబేడ్కర్‌నగర్‌లో నివాసముంటున్నారు. ఈనెల 22న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరి వేసుకుంది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొన్నారు.

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌కు

మీడియా ప్రతిభా పురస్కారం



షేక్ అన్సారీకి పురస్కారం ప్రదానం చేస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి

చిక్కడపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యూస్‌చానల్ 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ షేక్ అన్సారీకి మీడియా ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హై కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.శేషశయనారెడ్డి అన్సారీకి పురస్కారం ప్రదానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీడియాలో నాణ్యమైన ప్రసారాలకు తెరవెనుక పనిచేసే వారి సమష్టి కృషి కారణమన్నారు. కళాపోషకుడు రాజశేఖరరెడ్డి అధ్యక్షత వహించిన సభలో బి.నరసింహారావు, కే.విజయలక్ష్మి, రవికుమార్, కుసుమభోగరాజు పాల్గొనగా, సంస్థ చైర్మన్ గుదిబండ వెంకటరెడ్డి స్వాగతం పలికారు.

నిర్వహణ లోపం.. ప్రజలకు శాపం

ముళ్ల పొదలు, అపరిశుభ్రతకు నిలయం

- పనిచేయని పవర్‌బోరు.. నిరుపయోగంగా స్నానాల గదులు
- ఇదీ బీజేఆర్‌నగర్ శ్మశానవాటిక దుస్థితి

అమీర్‌పేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికలను వైకుంఠధామాలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం అమీర్‌పేట డివిజన్ బీజేఆర్‌నగర్‌లోని శ్మశానవాటిక నిర్వహణ లోపం కారణంగా అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. 68 లక్షల రూపాయలతో శ్మశానవాటికను అభివృద్ధి చేశారు. కానీ నిర్వహణ లేకపోవడంతో ముళ్ల పొదలు, చెత్త కుప్పగా మారింది. కేర్‌టేకర్ లేకపోవడంతో శ్మశానవాటిక అస్తవ్యస్తంగా మారిపోయింది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గతంలో రకరకాల పూలమొక్కలు, పచ్చటి గ్రీనరి, వాకింగ్ ట్రాక్‌లు, సేద తీరేందుకు బెంచీలు ఉండేవి. పచ్చని మొక్కలు, రంగు రంగుల పూల మొక్కలతో ఆహ్లాదకర వాతావరణంలో దహన సంస్కారాలు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి



పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయిన శ్మశానవాటిక



నిరుపయోగంగా స్నానాల గదులు

కనిపించడం లేదు. ఉదయం సమయంలోనూ శ్మశానవాటికలోకి వెళ్లేందుకు స్థానికులు జంకుతున్నారు. దీన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచీ కేర్ టేకర్ లేకపోవడంతో ఆకతాయిలు పేకాట ఆడడం, మద్యం తాగేవారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం చిత్తు కాగితాలు ఏరుకుని జీవించే వాళ్లు మత్తులో డబ్బుల విషయమై గొడవ పడి ఓ వ్యక్తిని హత్య చేసిన విషయం తెలిసిందే.. స్థానికులు అభ్యర్థన మేరకు మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ లక్షలాది రూపాయలు మంజూరు చేయించి సుందరంగా తీర్చిదిద్దిన ఈ వైకుంఠధామం నేడు అధ్వానంగా తయారవడంతో ప్రజలు బాధపడుతున్నారు. నిత్యం ప్రధాన గేటు తెరిచే ఉండడంతో మలమూత్ర విసర్జనలు చేస్తుండడంతో లోపలికి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది.

నిరుపయోగంగా స్నానాల గదులు

లక్షలు వెచ్చించి నిర్మించిన స్నానాల గదుల ముందు ముళ్ల చెట్లు పెరిగాయి. వీటి కారణంగా స్నానాల గదుల్లోకి వెళ్లలేని పరిస్థితి. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. దహన సంస్కారాల అనంతరం ఆరుబయటే స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ ఏర్పాటు చేసిన పవర్ బోరు పని చేయకపోడంతో వాటర్ ట్యాంకర్లను తెప్పించుకుని స్నానాలు చేస్తున్నారు. అస్థికలు భద్రపరిచే గదికి తలుపులు లేక పోవడంతో మలమూత్ర విసర్జన చేస్తున్నారు.

కేర్‌టేకర్‌ను నియమించాలి

ప్రజల అవసరాల దృష్ట్యా లక్షలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామం నిర్వహణలోపంతో అధ్వానంగా తయారయింది. దహన సంస్కారాల కోసం ఇక్కడికి వచ్చేవారు నానా ఇబ్బందులు పడుతున్నారు. పతేనగర్ ఫై ఓవర్ బ్రిడ్జి సమీపంలోని వైకుంఠధామానికి ఏర్పాటు చేసినట్లే ఒక కేర్‌టేకర్‌ను నియమించి ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా అస్థికలు భద్రపరిచే గది

రైల్వే ఉద్యోగులకు అవార్డులు ప్రదానం

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలందించిన తొమ్మిది మంది ఉద్యోగులకు మంగళవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో జరిగిన భద్రతా సమీక్ష (వీడియో కాన్ఫరెన్స్) సమావేశం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ 'మ్యాన్ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులు ప్రదానం చేశారు. లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, టెక్నీషియన్లు, పాయింట్స్ మ్యాన్‌లు అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ జోన్‌లో నిరంతరం సేఫ్టీ డ్రైవ్‌లను కొనసాగించాలని, అదనపు లూప్‌లైన్ల ఏర్పాటుతో పాటు డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ట్రాక్ పునరుద్ధరణ పనుల పురోగతిని సమీక్షించారు. పనుల్లో వేగం పెంచి గడువు లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. రైళ్ల సమయపాలన, గణాంకాలపై చర్చించారు ట్రాఫిక్ బ్లాక్‌లు లేకుండా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు.

ఎవరూ మోసపోవొద్దు

- బిగ్‌బాస్‌లో అవకాశం ఇప్పిస్తానని రూ.2.75 లక్షలు వసూలు
- యాంకర్ స్వప్నను మోసం చేసిన తమ్మలి రాజు



తమ్మలి రాజు ఇచ్చిన బాండ్‌పేపర్, చెక్కు చూపుతున్న స్వప్న

పంజాగుట్ట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బిగ్ బాస్ షోలో అవకాశం కల్పిస్తానని నమ్మించి తన నుంచి 2.75 లక్షల రూపాయలు తీసుకుని తమ్మలి రాజు మోసం చేశాడని యాంకర్, సినీనటి ఏ.స్వప్న చౌదరి తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాది కె.రాజేష్‌కుమార్, డాక్యుమెంటరీల నిర్మాత టి.సాయికృష్ణ, యాంకర్ సుధాకర్‌లతో కలిసి ఆమె మాట్లాడారు. తాను రాజు చేతిలో ఏవిధంగా మోసపోయిందో వివరించారు. తనకు బిగ్‌బాస్ షోలో పాల్గొనాలనే కోరిక ఉందని తన స్నేహితుడు సాయికృష్ణకు చెప్పితే గత సంవత్సరం జూన్‌లో బిగ్‌బాస్ షోకు కాస్ట్యూమ్స్ అందజేసిన తమ్మలి రాజు పరిచయం చేశాడు. బిగ్‌బాస్‌లో అవకాశం వస్తే పీఆర్‌ఓను పెట్టుకోవాల్సి ఉంటుందని, తనకు 5 లక్షలు ఇస్తే ప్రకటనలకు, కాస్ట్యూమ్స్ చూసుకుంటానని చెప్పాడన్నారు. అలా గత జూన్‌లో పలుమార్లు 2.50 లక్షలు రూపాయలు ఆన్‌లైన్ ద్వారా, ఫొటోషూట్ అంటూ మరో 25 వేల రూపాయలు అంటూ మొత్తం 2.75 లక్షలు ఇచ్చినట్టు తెలిపారు. తనకు బిగ్‌బాస్‌లో అవకాశం రాకపోవడంతో పాటు అతడిపై అనుమానం రావడంతో తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా, బాండ్‌పేపర్, చెక్కు ఇచ్చాడన్నారు. డిసెంబర్ 21న చెక్కు గడువు ముగియడంతో చెక్కు బ్యాంకులో వేసుకుంటానని చెప్పగా మరి కొంత సమయం అడిగాడన్నారు. గట్టిగా నిలదీసేసరికి బెదిరించాడన్నారు. దీంతో మోసపోనని గ్రహించి స్వప్న ఈనెల 19న జూబ్లీహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేశానన్నారు. తనలా ఎవరూ మోసపోవద్దని తెలిపారు. ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు

యూసుఫ్‌గూడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం జరిగిన ర్యాలీలో నిబంధనలు అతిక్రమించిన వారిపై మధురానగర్ పోలీసులు పలు కేసులు నమోదు చేశారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా జరుగుతున్న వేడుకల నేపథ్యంలో సోమవారం రహ్మత్‌నగర్ చౌరస్తా డీజేతో ఊరేగింపు చేస్తున్నారు. అంతేకాకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. డీజేలను స్వాధీనం చేసుకొని భరత్, శ్రీజిత్‌రాజ్, విజయ్, గంగరాజు, ప్రేమ్‌కుమార్, సిజిత్, సర్దార్ మరికొందరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో వారిపై కేసులు నమోదు చేశారు. కార్మికనగర్ సంతోషిమాత ఆలయం ప్రాంతంలో కొందరు డీజేతో పాటు బాణాసంచా కాలుస్తూ ఊరేగింపు చేశారు. బాణాసంచా ప్రమాదకరమని, డీజేకు అనుమతి లేదని పోలీసులు చెప్పినా వినిపించుకోకుండా ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించారు. దీంతో గోపాల్‌రెడ్డి, భరత్, సూర్యా, పవన్, అవినాష్ తదితరులపై కేసు నమోదు చేశారు. మరో సంఘటనలో డీజే ఏర్పాటు చేసి బాణాసంచా కాలుస్తూ పెద్దఎత్తున ధ్వని చేయడంతో లక్ష్మణ్, కార్తీక్‌లతో పాటు మరి కొందరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.



గృహాల సమీపంలో కాలుతున్న చెత్త

చెత్తకు నిప్పు.. ప్రజలకు ముప్పు

ఖైరతాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ మహాభారత్‌నగర్ ఖాళీ ప్రదేశంలో చెత్తను తొలగించకుండా తరుచూ కాల్చుతుండడంతో పొగతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి పెద్ద మొత్తంలో చెత్తను కాల్చుతుండడంతో ఇళ్లలోకి పొగ చేరడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారమిచ్చినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. చెత్తలోని ప్లాస్టిక్ తదితర వస్తువులు కాలడంతో దుర్గంధం కారణంగా ప్రజలకు ముప్పు ఏర్పడే ప్రమాదముందని తెలిపారు.

'కాళేశ్వరంపై సిట్ ఏర్పాటు చేయాలి'



మాట్లాడుతున్న మా తెలంగాణ పార్టీ అధ్యక్షుడు కె.వీరారెడ్డి

పంజాగుట్ట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై జ్యూడీషియల్ విచారణ కాదని, సిట్ ఏర్పాటు చేసి ఆర్థిక నేరానికి పాల్పడిన వారిని అరెస్టు చే యాలని మా తెలంగాణ పార్టీ అధ్యక్షుడు కె.వీరారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు బి.నాగరాజు, కార్యదర్శులు జి.క్రాంతి, మహేష్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై గడిచిన మూడేళ్లుగా పార్టీ ఆధ్వర్యంలో పోరాడుతున్నామని వీరారెడ్డి తెలిపారు. నీరు లేని దగ్గర నీళ్లు ఉన్నాయని చెప్పి కేసీఆర్ ప్రాజెక్టు రీ డిజైన్ చేసి అవినీతిని ప్రారంభించాడన్నారు. ఇప్పటి వరకు పంప్‌హౌజ్ వద్దకు వెళ్లడానికి ప్రజలకు, మీడియాకు అనుమతి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతిపై కేసీఆర్, తదితరులపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పందించి కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు, పోరాటాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

'రజక సామాజికవర్గానికి ఎంపీ టికెట్ ఇవ్వాలి'



మాట్లాడుతున్న ఎన్.శ్రీనివాస్

పంజాగుట్ట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కరీంనగర్, ఖమ్మం స్థానాల్లో ఒక స్థానాన్ని రజక సామాజిక వర్గానికి కేటాయించాలని నేషనల్ ధోబీ రిజర్వేషన్ (ఎస్సీ) సంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ కాంగ్రెస్ అధిష్ఠానానికి, టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ బాగయ్య, బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎం.ఎస్ నరహరి, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ సామాజికవర్గంలో అత్యంత వెనుకబడిన రజక సామాజికవర్గం ఇప్పటి వరకు పార్లమెంటు గడప ఎక్కలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో సీడబ్ల్యూసీ, జాతీయ ప్రధాన కార్యదర్శి, పీసీసీ అధ్యక్షుడిగా అవకాశం రాలేదన్నారు. ఇప్పటికైనా అధిష్ఠానం, టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్, ఖమ్మం నియోజకవర్గాలలో ఒక స్థానాన్ని రజక సామాజికవర్గానికి కేటాయించాలని కోరారు. గడిచిన 30 సంవత్సరాలుగా పార్టీకి సేవ చేస్తున్న సీనియర్ నాయకుడు, ఏఐసీసీ ఓబీసీ సెల్ సమన్వయకర్త, మధ్యప్రదేశ్ రాష్ట్ర ఓబీసీ సెల్ ఇన్‌చార్జి హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామానికి చెందిన ఉల్లెంగుల యాదగిరి పోటీ చేయడానికి అవకాశం కల్పిస్తే అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకల్లో బకిని నర్సింలు, భూపాల్‌రెడ్డి, ఎస్.నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని బాలరాముడిని దర్శించుకున్న వనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, యశోద ఆస్పత్రి చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథ రామారెడ్డి దంపతులు

ల్యాప్‌టాప్‌లు చోరీ

దుండిగల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై డబ్బు కోసం హాస్టల్స్‌లో ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థిని, అతని వద్ద కొనుగోలు చేసిన వ్యక్తిని బాలానగర్ ఎస్‌ఓటీ, దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద 10 లక్షల రూపాయల విలువ చేసే 20 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. గాజులరామారం, భవానీనగర్‌లో నివాసముంటున్న అపల బాలరాజు(20) బీటెక్ చదువుతున్నాడు. ఇతడికి క్యాసిఫై యాప్ నిర్వాహకుడు రాజ్‌కుమార్ కుస్వా(20) ఆన్‌లైన్‌లో పరిచయమయ్యాడు. హాస్టల్స్‌లో ల్యాప్‌టాప్‌లు దొంగిలించిన విక్రయించి డబ్బు సంపాదిస్తున్నాడు. సమాచారం అందుకున్న దుండిగల్, ఎస్‌ఓటీ పోలీసులు నిఘా పెట్టి బాలరాజు, రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. మరో నిందితుడు ప్రవీణ్‌కుమార్ పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది



ఐఐఎంసీ డైరీని ఆవిష్కరిస్తున్న కళాశాల చైర్మన్ విశ్వనాథం, రూపకర్త రఘువీర్

ప్రముఖుల వివరాలతో ఐఐఎంసీ డైరీ

ఖైరతాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతియేటా ఒక విశేషతతో ముద్రించే ఐఐఎంసీ వారి 2024 సంవత్సర డైరీ ఆవిష్కృతమైంది. సర్వోన్నత వ్యక్తులు, సాహిత్యకారులు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల విశేషాలతో కూడిన ఈ 2024 డైరీని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ) ప్రిన్సిపాల్ కూర రఘువీర్ రూపొందించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ విశ్వనాథం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూర రఘువీర్ అకుంఠిత తపస్సు, తపనతో 15 సంవత్సరాలుగా వైవిద్యమైన డైరీలను రూపొందించి ఎంతో మందికి విలువైన సమాచారాన్ని అందజేస్తున్నారన్నారు. విలువలపై ఆధారపడి జీవిస్తూ అంతే విలువైన జ్ఞానాన్ని సమాజానికి అందజేస్తుండడం గొప్ప విషయమన్నారు. కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ పూర్ణచందర్ మాట్లాడుతూ.. విద్యారంగంలో ఉన్న రఘువీర్ తమ విద్యార్థులకు ప్రతియేటా విలువైన జ్ఞానాన్ని సమకూరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్‌లో కారుణ్య నియామకాలు చేపట్టాలి



మాట్లాడుతున్న కారుణ్య నియామక అభ్యర్థి నాగమణి

పంజాగుట్ట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పంచాయతీరాజ్ శాఖలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టి తమను ఆదుకోవాలని వివిధ జిల్లాలకు చెందిన జిల్లా పరిషత్ కారుణ్య నియామక అభ్యర్థులు సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగం చేసిన వారిని కోల్పోయి తాము ఎన్నో ఇబ్బందులు పడ్డామని పలువురు అభ్యర్థులు అన్నారు. ఏడు జిల్లాల వారికి ఉద్యోగాలు ఇచ్చారని, మిగతా జిల్లాలకు చెందిన తాము ఏమి తప్పు చేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి తమకు ఉద్యోగం ఇప్పించాలని వారు వేడుకున్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సూర్యాపేటకు చెందిన నాగమణి, యాదాద్రికి చెందిన బావేశ్, నల్గొండకు చెందిన సబిత, రంగారెడ్డికి చెందిన వెంకట్, భద్రాద్రికి చెందిన సాయిప్రసాద్ తమ బాధ తెలిపారు.

- జిల్లా పరిషత్‌లో.. కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకుని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నా ఇప్పటికీ ఇవ్వలేదని, దాంతో తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లో కారుణ్య ఇవ్వగా, తమకు మాత్రం రాలేదన్నారు. ఇటీవల 7 జిల్లాల వారికి ఇచ్చి మిగతా జిల్లాలవారికి ఇవ్వలేదన్నారు. సీఎం స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.



ప్రయాణికులకు గిఫ్ట్ ప్యాకెట్ అందజేస్తున్న ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ రాజ్‌కుమార్

జ్యోతిర్లింగ భారత్ గౌరవ్ రైలు ప్రారంభం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నుంచి జ్యోతిర్లింగ దక్షిణ యాత్ర భారత్ గౌరవ్ రైలును మంగళవారం 75 ఏళ్ల ప్రయాణికుడు రఘుమారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించినట్టు ఐఆర్‌సీటీసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నుంచి బయలుదేరే రైలు ఖాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా తిరువణ్ణామలై, అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు వెళుతుందన్నారు. రైలుకు ప్రయాణికుల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఐఆర్‌సీటీసీ అధికారులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు అవార్డులు ప్రదానం

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలందించిన తొమ్మిది మంది ఉద్యోగులకు మంగళవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో జరిగిన భద్రతా సమీక్ష (వీడియో కాన్ఫరెన్స్) సమావేశం సందర్భంగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ 'మ్యాన్ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులు ప్రదానం చేశారు. లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, టెక్నీషియన్లు, పాయింట్స్ మ్యాన్‌లు అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ జోన్‌లో నిరంతరం సేఫ్టీ డ్రైవ్‌లను కొనసాగించాలని, అదనపు లూప్‌లైన్ల ఏర్పాటుతో పాటు డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ట్రాక్ పునరుద్ధరణ పనుల పురోగతిని సమీక్షించారు. పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. రైళ్ల సమయపాలన, గణాంకాలపై చర్చించారు ట్రాఫిక్ బ్లాక్‌లు లేకుండా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అవార్డులు అందుకున్న వారిని అభినందించారు.

సికింద్రాబాద్, తిరుపతి మార్గంలో ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ మార్గంలో నాలుగు ప్రత్యేక రైలు సర్వీసులు నడపనున్నట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్-తిరుపతి స్పెషల్ (రైల్ నెంబర్: 07041) సికింద్రాబాద్ నుంచి ఈనెల 25వ తేదీ రాత్రి 8.00 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.00 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుపతి-సికింద్రాబాద్ స్పెషల్ (రైల్ నెంబర్: 07042) తిరుపతి నుంచి ఈనెల 26వ తేదీ రాత్రి 7.50 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. సికింద్రాబాద్-తిరుపతి స్పెషల్ (రైల్ నెంబర్: 02764) సికింద్రాబాద్ నుంచి ఈనెల 27వ తేదీ సాయంత్రం 6.40 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6.45 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుపతి- సికింద్రాబాద్ స్పెషల్ (రైల్ నెంబర్: 02763) తిరుపతి నుంచి ఈనెల 28వ తేదీ సాయంత్రం 5.15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5.55 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది.



లాలాగూడ రైల్వే ఆస్పత్రి డైరెక్టర్‌ను కలిసిన మజ్దూర్ యూనియన్ నేతలు

రైల్వే ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలి

దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి రవీందర్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ఉద్యోగులకు లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి రవీందర్ తెలిపారు. మెట్టుగూడలోని కేంద్రీయ రైల్వే ఆస్పత్రి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి నిర్మల రాజారాంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే రంగంలో పనిచేస్తున్న కార్మికులు ఉద్యోగులకు సకాలంలో వైద్య సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యూనియన్ నాయకులు విన్నవించిన సమస్యలపై ఆమె స్పందించారని చెప్పారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ జోనల్ అసిస్టెంట్ ప్రధాన కార్యదర్శి బారాటీ, అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీ చిలుకు స్వామి, కోశాధికారి నర్సింహారెడ్డి, కార్యదర్శులు సమ్మయ్య, చైర్మన్ రాంమ్మోహన్, పాషాతో పాటు పలువురు పాల్గొన్నారు.

18నెలలుగా వేతనాలు లేవు

సంగీత, నృత్య అధ్యాపకుల గౌరవ వేతనం చెల్లించండి

చిలకలగూడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకి 18నెలలుగా గౌరవ వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకి గురవుతున్నారు. ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలల్లో సిబ్బంది కొరత వలన పేరిణి, కూచిపూడి, భరత నాట్యం, హిందూస్తానీ గాత్రం విద్యార్థులకి నేర్పించడానికి కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలు చేసి నెలకి 26000 వేల రూపాయలు గౌరవ వేతనంగా చెల్లిస్తుంటారు. నగరంలో వున్న మూడు కాలేజీల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వుంది. సంగీత వాద్య పరికరాలు వీణా, వయోలిన్ వంటివి శృతి లేక సరిగ్గా పనిచేయక విద్యార్థులు తీవ్ర సమస్యలు పడుతున్నారు. వీణ వంటివి ప్రతిరోజు వెంట తీసుకురావడం ఇబ్బంది. అక్కడే క్లాసుల్లో అందజేస్తుంటారు. ఈనేపథ్యంలో అధ్యాపకులను వంతుల వారీగా వారంలో మూడు రోజులు ఒక చోట, మరో మూడు రోజులు వేరే కాలేజీలో విధులు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించిన వారికి గౌరవ వేతనం వెంటనే చెల్లించటానికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి. పేరు చెప్పటానికి ఇష్టపడని ఓ నృత్య అధ్యాపకుడు గత 18నెలలుగా గౌరవ వేతనం అందక తీవ్ర ఇబ్బందులకి గురవుతున్నానని, ఈరోజు వరకు ఎటువంటి చెల్లింపు జరగలేదని ఆంధ్రజ్యోతితో తన బాధ వెళ్లబోసుకున్నాడు.

గాంధీలో ఆకస్మిక తనిఖీలు



గాంధీలో ఆకస్మిక తనిఖీలుచేస్తున్న టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ డైరెక్టర్ కర్నన్

అడ్డగుట్ట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రిలో టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ డైరెక్టర్ ఐఏఎస్ అధికారి కర్నన్ తనిఖీలు చేశారు ఆస్పత్రి అత్యవసర విభాగంలోకి వచ్చే రోగుల్ని ఎలా సేవలందిస్తున్నారు. సమయానికి క్యాజువాలిటీకి తీసుకెళుతున్నారా. అంబులెన్స్‌లో వచ్చే రోగులను ఎలా రిసీవ్ చేసుకుంటారన్న పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు. స్వయంగా క్యాజువాలిటీ వార్డు వద్ద సేవల్ని పరిశీలించారు. అదేవిధంగా ఆస్పత్రి 8వ అంతస్తులో ఉన్న అవయవాల ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాన్ని పరిశీలించారు. ఐవీఎఫ్ సెంటర్‌లో సేవల్ని పరిశీలించారు. అనంతరం ఎలక్ట్రికల్ సెక్షన్, డ్రైనేజీ వంటి ముఖ్యమైన సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. పలు వివిధ విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రికి కావాల్సిన సేవలు వైద్య యంత్రాలు సమకూర్చేందుకు ప్రణాళిక చర్యలు తీసుకుంటామన్నాని ఐఏఎస్ అధికారి తెలిపారు. ఆయన వెంట గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, ఆర్‌ఎంఓ డాక్టర్ జయకృష్ణలతో పాటు వివిధ విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో బొల్లారం గ్రంథాలయం



ఆదర్శ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న గ్రంథాలయం

- 20 ఏళ్లుగా నెలకు రూ.5వేలతో..
- రూ.కోటి యాభై లక్షలతో నిర్మాణానికి భూమి పూజ
- ఇంకా ప్రారంభం కాని పనులు



బొల్లారం గాంధీ గ్రౌండ్‌లో పక్కా భవనం నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం

తిరుమలగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని ఉన్న చందంగా తయారైంది బొల్లారం గ్రంథాలయం పరిస్థితి. గతంలో ఎందరో మేధావులు గ్రంథాలయాల్లోకి వెళ్లి తమకు తోచిన పుస్తకాలను తీసుకుని పఠనం చేస్తూ మేధోసంపతి పెంచుకునేవారు. అలాంటి గ్రంథాలయం దయనీయంగా మారింది. కొన్ని సంవత్సరాల క్రితం కంటోన్మెంట్ వార్డ్ కార్యాలయంలో ఉన్న బొల్లారం గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారులు పక్కా భవనం నిర్మిస్తాం సమీపంలో ఉన్న అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో గ్రంథాలయ అధికారులు సమీపంలోని అంబేద్కర్ భవనంలోకి గ్రంథాలయాన్ని మార్చారు. అప్పటి నుంచి ఈ గ్రంథాలయానికి కష్టాలు మొదలయ్యాయి. భవనం నిర్మించకపోవడంతో అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఉన్న కొన్ని పుస్తకాలకు రక్షణ లేకుండా పోయింది. అందులో 15-16 సంవత్సరాలు కొనసాగిన తర్వాత వాళ్లు కూడా ఖాళీ చేయమని చెప్పడంతో అక్కడి నుంచి బొల్లారం డౌటన్ బజార్‌లోని రీడింగ్ రూంకు తరలించారు. అక్కడ సంవత్సరం కొనసాగిన తర్వాత స్థానికులతో వ్యతిరేకత రావడంతో బొల్లారం ఆదర్శ్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌కు తరలించారు. ప్రస్తుతం అందులో కొనసాగుతున్నా సరైన వసతులు లేక పాఠకులకు కావలసిన పుస్తకాలు దొరకక సతమతమవుతున్నారు. 20 ఏళ్లుగా నెలకు 5వేల రూపాయలు అద్దె చెల్లిస్తూ గ్రంథాలయం కొనసాగిస్తున్నారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయానికి గ్రూప్ 4 ఎంప్లాయి ఇన్‌చార్జి

కొన్ని సంవత్సరాలుగా బొల్లారం గ్రంథాలయానికి గ్రూప్ 4 ఎంప్లాయి ఇన్‌చార్జిగా ఉండడం వల్ల సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. పూర్తిస్థాయిలో లైబ్రేరియన్‌ను నియమించాలని పలువురు కోరుతున్నారు.

పక్కా భవనం నిర్మించేది ఎప్పుడు?

బొల్లారం బజార్‌లోని గాంధీ గ్రౌండ్‌లో ఒక కోటి యాభై లక్షలతో పక్కా నిర్మాణానికి భూమి పూజ చేస్తూ శిలాఫలకం ఏర్పాటు చేశారు. కొన్ని నెలలు గడుస్తున్నా నిర్మాణాలు ప్రారంభం కాలేకపోవడంతో సర్వత్రా ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. బడ్జెట్‌లో కేటాయించినప్పటికీ నిర్మాణ పనులు ఇంకా ఎందుకు కావడం లేదంటూ స్థానికులు అధికాలను ప్రశ్నిస్తున్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

టెండర్ ప్రాసెస్‌లో ఉంది



బొల్లారం గ్రంథాలయంలో 900మంది సభ్యులు ఉన్నారు. 9 దినపత్రికలు అందుబాటులో ఉండటమే కాకుండా 13,000 పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంచాం. బొల్లారం బజార్‌లోని గాంధీ గ్రౌండ్‌లో నూతన భవనానికి శంకుస్థాపన చేయడం వాస్తవమే కానీ ప్రభుత్వం మారడంతో పనులు కొద్దిగా ఆలస్యం అవుతున్నాయి. నిర్మాణానికి టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది.

- సురేష్‌బాబు, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి



రథ యాత్రలో కార్పొరేటర్ కొంతం దీపిక, భక్తులు

శ్రీరాముడి రథయాత్ర

రెజిమెంటల్‌బజార్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : అయోధ్యలో రామచంద్రమూర్తి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా రెజిమెంటల్‌బజార్‌లో కాశీ విశ్వనాథస్వామి ఆలయం కోదండరామ ఆలయంలో ఉన్న శ్రీరాముడి ఉత్సవ విగ్రహానికి అభిషేకం పూజలు నిర్వహించారు. సాయంత్రం రథయాత్ర నిర్వహించారు. బస్తీవాసులు మంగళహారతులతో రథానికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు భాస్కరభట్ల రామశర్మ, కార్పొరేటర్ కొంతం దీపిక, ఆలయ చైర్మన్ ఓదెల అజయ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.



బొల్లారం సర్దార్ వల్లభాయ్ పటేల్ హాస్పిటల్‌లో శ్రీరాముని చిత్రపటానికి పూజలు చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు . ధనంజయచారి

శ్రీరాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు

తిరుమలగిరి జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని బొల్లారం సర్దార్ వల్లభాయ్ పటేల్ హాస్పిటల్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధనంజయచారి ఆధ్వర్యంలో శ్రీరాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు రామకృష్ణ, జగన్ మోహన్‌చారి పాల్గొన్నారు.

'ఆశా వర్కర్ల పారితోషికాలు చెల్లించండి'

హరిహరకళాభవన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల పని భారం తగ్గించాలని, వేతనం నిర్ణయించి సకాలంలో చెల్లించాలని హైదరాబాద్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్.జె.వెంకటికి తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి యం.వెంకటేష్ వినతి పత్రం సమర్పించారు. సికింద్రాబాద్, హరిహర కళాభవన్ ఆవరణలో మంగళవారం ఆయనను కలిసి డిసెంబర్ నెల పారితోషికాలు ఇప్పటికీ చెల్లించలేదని, సకాలంలో పారితోషికాలు అందక ఆశా వర్కర్లు తీవ్ర ఇబ్బందులకి గురవుతున్నారని, సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమమంలో సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు ఎం.మీనా, టి.యాదమ్మ, ఎం.అనిత తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యం

రెజిమెంటల్‌బజార్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ చదువుతున్న తన కొడుకు కనిపించకుండా పోయాడని తల్లి మార్కెట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కిషన్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ సెకండ్‌బజార్‌కు చెందిన భాగ్యలక్ష్మి తన కుమారుడు మహేష్‌తో కలిసి శుక్రవారం సికింద్రాబాద్ 31 బస్టాప్‌లో 23బి బస్సు ఎక్కింది. భూదేవినగర్ బస్టాప్ రాగానే దిగడానికి కుమారుడిని పిలవగా కుమారుడు కనిపించలేదు. అచూకీ లభించకపోవడంతో మార్కెట్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హాస్టల్స్‌లో ల్యాప్‌టాప్‌లు చోరీ

ఇంజనీరింగ్ విద్యార్థి, మరొకరి అరెస్టు

దుండిగల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చెడువ్యసనాలకు బానిసై డబ్బు కోసం హాస్టల్స్‌లో ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థిని, అతనివద్ద కొనుగోలు చేసిన వ్యక్తిని బాలానగర్ ఎస్‌ఓటీ, దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద 10 లక్షల రూపాయల విలువ చేసే 20 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. గాజులరామారం, భవానీనగర్‌లో నివాసముంటున్న ఈశ్వరయ్య కుమారుడు అపల బాలరాజు (20) ఎంఎల్‌ఆర్ఐటీలో బీటెక్ చదువుతున్నాడు. ఇతడికి హిమాయత్‌నగర్, అడ్వకేట్స్ కాలనీకి చెందిన క్యాసిఫై యాప్ నిర్వాహకుడు రాజ్‌కుమార్ కుస్వా (20) ఆన్‌లైన్‌లో పరిచయమయ్యాడు. గండి మైసమ్మ ప్రాంతంలోని హాస్టల్స్‌లో ల్యాప్‌టాప్‌లు దొంగిలించిన బాలరాజు వాటిని రాజ్‌కుమార్, పర్వేష్‌కుమార్‌ల ద్వారా విక్రయించి డబ్బు సంపాదిస్తున్నాడు. సమాచారం అందుకున్న దుండిగల్, ఎస్‌ఓటీ పోలీసులు నిఘా పెట్టి బాలరాజు, రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. మరో నిందితుడు ప్రవీణ్‌కుమార్ పరారీలో ఉన్నాడు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ఏడీఈ విజయ్‌కుమార్

మారేడ్ పల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మారేడ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఈనెల 25వ తేదీన ఉన్నత అధికారుల సమావేశం ఉంటుందని ఏడీఈ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... గురువారం ఉదయం 10.30 నిమిషాల నుంచి 1 గంట వరకు కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్న వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో కన్జూమర్ గ్రీవెన్సెస్ వె డ్రే సెల్ ఫోరం (సీ.జీ.ఆర్.ఎఫ్) చైర్‌పర్సన్ టెక్నికల్ మెంబర్స్, ఫైనాన్స్ మెంబర్స్, కన్జూమర్ ఎఫైర్స్ మెంబర్స్ కార్యక్రమానికి విచ్చేయనున్నట్లు తెలిపారు. కంటోన్మెంట్ పరిధిలోని 2,3,4,5 వార్డుల ప్రజలు, ఈస్ట్, వెస్ట్ మారేడ్‌పల్లి, అడ్డగుట్ట ఎ, బి, సి, డి సెక్షన్లు తదితర ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవచ్చని, విద్యుత్ సమస్యల గురించి మాట్లాడవచ్చని ఆయన చెప్పారు. విద్యుత్ బిల్లుల హెచ్చు తగ్గుల విషయంపై ఫిర్యాదు చేసి తగు పరిష్కారం పొందవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు పాల్గొనాలని, మరిన్ని వివరాలకు 9440812848 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.



చైల్డ్ పార్లమెంట్ సభలో మాట్లాడుతున్న బాలబాలికలు

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

రాంగోపాల్‌పేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పికెట్ ఉన్నత పాఠశాల ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం యాక్షన్ ఎయిడ్ ద్వారా చైల్డ్ పార్లమెంట్ సభ ఏర్పాటు చేయడం జరిగింది. జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్ ఏవిధంగా ఉంటుంది, అక్కడ ఉన్న వాళ్ళు ఏ విధంగా ప్రవర్తిస్తారు అనే అంశంపైన పిల్లలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. అందులో ముఖ్యంగా అమ్మాయిలకు ఎంత ప్రాధాన్యత ఇవ్వాలి అనే అంశాన్ని కూడా తెలియజెప్పడం జరిగింది. ఈ ప్రోగ్రాం చేయడానికి యాక్షన్ ఎయిడ్ ప్రతినిధులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో 90 మంది స్కూల్ బాల బాలికలు పాల్గొన్నారు.టాటా కన్సల్‌టెన్సీ సర్వీస్ కంపెనీ నుంచి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తిరుమలగిరిలో సీఎం ఫుట్‌బాల్ టోర్నమెంట్

తిరుమలగిరి జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరిలో ఉన్న ఫుట్‌బాల్ గ్రౌండ్ సీఎం కప్ పోటీలకు సిద్ధమవుతుంది. యూనిటీ స్పోర్ట్స్ క్లబ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. సీఎం కప్ పేరుమీద ఈ పోటీల్లో సుమారు 14 టీమ్ లు కంటోన్మెంట్, జీహెచ్‌ఎంసీ పరిసర ప్రాంతాల్లో నివసించే క్రీడాకారులను ప్రోత్సాహించే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్ మాజీ కెప్టెన్ విక్టర్ అమూల్ రాజ్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ కన్వీనర్ రేమండ్ హార్వర్డ్, క్రీడాకారుడు ప్రతాప్ శీలన్, జాన్ రాఫిక్స్ బెర్నాడు, కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్ లు పోటీల వివరాలను మంగళవారం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటోన్మెంట్ ఒలంపిక్స్ వెళ్లిన ఫుట్‌బాల్ ప్లేయర్స్ ఎందరో ఉన్నారని అలాంటి క్రీడలు ఆడినవారు క్రమక్రమంగా కనుమరుగవుతున్నారని అలాంటి వారిని మళ్లీ ప్రోత్సాహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నమని వారు వెల్లడించారు.

అనంతరం క్రీడామైదానాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమములో యూనిటీ స్పోర్ట్స్ అకాడమి ప్రధాన కార్యదర్శి మైఖెల్ అబ్రహంలు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

రైలు ఢీకొని రైల్వే వెండర్ మృతి



రైల్వే వెండర్ మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తాగిన మైకంలో రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని రైలు ఢీకొన్న ఘటనలో బలమైన గాయాలతో అతను అక్కడికక్కడే మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ - జెమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్‌ల మార్గమధ్యలో మంగళవారం డౌన్ లైన్ వద్ద గుర్తుతెలియని 25 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉన్నాడన్న సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి వివరాలు సేకరించగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో వెండర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ అనే వ్యక్తిగా గుర్తించారు. కర్నాటక, బీదర్ కొట్యాల్ గ్రామానికి చెందిన మృతుడు బతుకు దెరువు కోసం సికింద్రాబాద్‌లో పనిచేస్తున్నట్లు తెలిసింది. గత కొద్ది రోజులుగా మద్యం సేవిస్తున్నాడని, పనికి వెళ్లకుండా మద్యానికి అలవాటు పడ్డాడని స్నేహితుల ద్వారా తెలిసిందని రైల్వే పోలీసులు తెలిపారు.

శ్రేష్ఠమైన భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



నేతాజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బండారు దత్తాత్రేయ, కొంతం దీపిక తదితరులు



నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు

రెజిమెంటల్‌బజార్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర పోరాటంలో సాయుధ పోరాటం అవసరమని తొలిగా ఇండియన్ ఆర్మీని తయారు చేసిన మనులు అజాద్ హింద్ ఫౌజ్ సృష్టికర్త నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువతకు ఆదర్శం అని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న నేతాజీ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..యువత దేశ భక్తి,సనాతన,సంస్కృతిని కాపాడడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్, కార్పొరేటర్ కొంతం దీపిక, రాజశేఖర్ రెడ్డి, రవీందర్, అశోక్‌కుమార్, సర్వేష్, సురేష్, అంజన్, మురళి, నరేందర్, తరుణ్, సందీప్, కొంతం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ : సాయుధ పోరాటం ద్వారానే భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని విశ్వసించి, ఏకంగా సైన్యాన్నే ఏర్పాటు చేసి, బ్రిటీష్ పాలకులను గజగజలాడించిన వీరునిగా నేతాజీ సుభాష్‌చంద్రబోస్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ శ్లాఘించారు. మంగళవారం బోయిన్‌పల్లి నేతాజీనగర్‌లోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, స్థానికులు వెంకట్, సిద్ధు, నాగేష్, ముఖేష్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నేతాజీకి నివాళులర్పిస్తున్న జంపన తదితరులు



తుకారాంగేట్ చౌరస్తాలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు